తొలగిన చిత్ర బార్ సీల్

- కక్షసాధింపులకు హైకోర్టు ఆదేశాలతో తెర
- న్యాయమే గెలిచిందన్న బార్ యాజమాన్యం

సిరిసిల్ల టౌన్, ఏప్రిల్ 2: కక్షసాధింపు చర్యల్లో భాగంగా సీజ్ చేసిన చిత్రబార్ ఎట్టకేలకు తెరుచుకున్నది. హైకోర్టు ఆదేశాలతో బార్ సీల్‌ను బుధవారం తొలగించడంతో హర్షం వ్యక్తమైంది. బీఆర్ఎస్ పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణికి సంబంధించిన సిరిసిల్లలోని చిత్ర బార్‌ను అధికారులు జనవరి 29న ట్రేడ్ లైసెన్సు సాకుతో సీజ్ చేశారు. తాము ఎటువంటి నిబంధనలు ఉల్లంఘించలేదంటూ సీజ్ సమయంలో చక్రపాణి మున్సిపల్ అధికారులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. మార్చి 31వరకు ట్రేడ్ లైసెన్సు ఫీజ్ చెల్లించేందుకు గడువు ఉన్నప్పటికీ కక్షసాధింపుతోనే తమ బార్‌ను సీజ్ చేశారని వాపోయారు. ఫీజు ఎంతో చెబితే వెంటనే చెల్లిస్తామని కోరిన కమిషనర్ స్పందించలేదు. కొద్దిసేపటికే ఆన్‌లైన్‌లో ఫీజు చెల్లించి సీల్ తొలగించాలని కోరినా పట్టించుకోలేదు. దీంతో నిబంధనలకు విరుద్ధంగా తమ బార్‌ను సీజ్ చేశారంటూ యాజమాన్యం హైకోర్టును ఆశ్రయించింది. దీంతో కోర్టు జనవరి 31న బార్ సీల్ తొలగించాలంటూ ఆదేశాలిచ్చింది. కానీ, అధికారులు మాత్రం బార్ సీల్ తొలగించకుండా రెండు నెలల పాటు కాలయాపన చేశారని బార్ యాజమాన్యం తెలిపింది. మరోసారి బార్ యాజమాన్యం కోర్టును ఆశ్రయించడంతో కోర్టు తీర్పును ధిక్కరించిన కమిషనర్ భౌతికంగా హాజరు కావాలంటూ ఫార్మ్-1 జారీ చేసింది చెప్పింది. కాగా, బుధవారం హైకోర్టులో విచారణ జరగగా బార్ సీల్‌ను వెంటనే తొలగించి, మరుసటి రోజు కోర్టుకు హాజరై వివరణ ఇవ్వాలని ఆదేశాలిచ్చినట్లు చెప్పారు. దీంతో కమిషనర్ బుధవారం సాయంత్రం హుటాహుటిన్ బార్ సీల్‌ను తొలగించారు. ఈ విషయంపై కమిషనర్ సమ్మయ్యను వివరణ కోరగా, కోర్టు ఆదేశాలతో బార్ సీల్ తొలగించామంటూ అక్కడి నుండి వెళ్లిపోయారు.

చిత్ర బార్ సీల్‌ను తొలగిస్తున్న మున్సిపల్ అధికారులు

న్యాయమే గెలిచింది : జిందం చక్రపాణి

మున్సిపల్ చైర్మన్‌గా తమ పదవీ కాలం ముగిసిన రెండు రోజుల్లోనే మున్సిపల్ అధికారులు తమకు కనీస సమాచారం ఇవ్వకుండానే ట్రేడ్ లైసెన్సు ఫీజు చెల్లించలేదంటూ బార్‌ను సీజ్ చేసి ఆర్థికంగా, మానసికంగా, రాజకీయంగా ఇబ్బందులకు గురిచేశారని బీఆర్ఎస్ సిరిసిల్ల పట్టణాధ్యక్షుడు జిందం చక్రపాణి ఆవేదన వ్యక్తం చేశారు. తాము న్యాయవ్యవస్థపై నమ్మకంతో హైకోర్టును ఆశ్రయించగా సీల్ తొలగించాలని ఆదేశాలు ఇచ్చిందని చెప్పారు. తాము న్యాయం కోసం చేసిన పోరాటంలో సాధించిన గెలుపుతో ప్రజాస్వామ్యం, రాజ్యాంగంపై నమ్మకం మరింత పెరిగిందన్నారు. రెండు నెలల కష్టకాలంలో తమకు అండగా నిలిచిన మాజీ మంత్రి కేటీఆర్‌తో పాటు పార్టీ నాయకులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

వేలం పాటను తగ్గించి ఇవ్వండి!

- రాజన్న ఆలయ తలనీలాల సేకరణకు కాంట్రాక్టర్ల వినతి
- మూడు గంటలు ఆలస్యంగా మొదలైన వేలం పాట
- వీడియో కాల్ ద్వారా వేలంకు హాజరైన ఈవో
- తక్కువకు ఇచ్చేది లేదని తేల్చి చెప్పిన అధికారులు
- నాలుగోసారి కూడా అదే పరిస్థితి

వేములవాడ, ఏప్రిల్ 2: రాజన్న ఆలయంలో భక్తులు సమర్పించే తలనీలాల టెండర్, వేలం పాటను తగ్గించి ఇస్తేనే ముందుకు వస్తామని కాంట్రాక్టర్లు తేల్చారు. రాజన్న ఆలయంలో 2025-27 రెండు ఆర్థిక సంవత్సరాలకు గాను స్వామి వారికి భక్తులు సమర్పించే తలనీలాలను సేకరించుకునేందుకు టెండర్, బహిరంగ వేలం పాటను 4వ సారి రాజన్న ఆలయంలో నిర్వహించారు. గడిచిన మూడు టెండర్లకు ఎవరూ ముందుకు రాకపోగా, బుధవారం మాత్రం కళావతి ఎంటర్‌ప్రైజెస్, నాగ కుమారి ఎంటర్‌ప్రైజెస్ హైదరాబాద్‌కు చెందిన కాంట్రాక్టర్లు హాజరయ్యారు. అయితే స్వామి వారి పాటగా 19 కోట్ల ఎనిమిది వేల నుంచి రాజన్న ఆలయ ఏఈవో శ్రావణ్ కుమార్ ప్రారంభించారు. తాము అంతా వేలంపాటలో పాల్గొనలేమని కాంటాక్ట్ వెల్లడించి తక్కువ నుంచి పాటను ప్రారంభించారు. కళావతి ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి ఎల్లయ్య రూ. 6 కోట్ల వరకు తన పాటను పాడారు. ఇక నాగ కుమారి ఎంటర్‌ప్రైజెస్ ప్రతినిధి భువన్ ఆరున్నర కోట్ల వరకు పాడగా అధికారులు ఇంత తక్కువకు తాము టెండర్ ఇవ్వలేమని వేలంపాటను రద్దు చేసినట్లు ప్రకటించారు. తిరిగి ఏప్రిల్ 10న నిర్వహిస్తామని వెల్లడించారు.

వీడియో కాల్ ద్వారా టెండర్ ప్రక్రియకు హాజరైన ఈవో..

తలనీలాల సేకరణ టెండర్, వేలంపాటను ఆలయ అధికారులు నిర్వహించారు. అయితే వేలంపాట రాజన్న ఆలయ ఈఈ రాజేశ్ సమక్షంలోని ఆయన కార్యాలయంలో నిర్వహించగా, ఏఈవో శ్రవణ్ కుమార్, పర్యవేక్షకుడు విజయ్ కుమార్, ఏఈ రామ్ కిషన్‌రావు, సీనియర్ అసిస్టెంట్ లక్ష్మీనర్సయ్య హాజరయ్యారు. ఇక వేలంపాటకు ఇద్దరు కాంట్రాక్టర్లు హాజరుకాగా ఆలయ అభివృద్ధి పనులు ప్రారంభమైతే భక్తుల రద్దీ తగ్గి, కల్యాణ కట్ట కూడా దూరం అవుతుందని దీనిపై స్పష్టత ఇవ్వాలని అధికారులను వారు కోరారు. దీంతో ఈవో వినోద్ రెడ్డి వీడియో కాల్ ద్వారా సాదరు కాంట్రాక్టర్లకు సమాధానం చెప్పారు. షెడ్యూల్లోనే ఇందుకు సంబంధించిన నిబంధన ఉందని వివరించారు. మొత్తం వేలం పాట పూర్తయ్యే వరకు ఆయన వీడియో కాల్ ద్వారా టెండర్ ప్రక్రియలో పాల్గొన్నారు.

వేలం నిర్వహిస్తున్న ఆలయ అధికారులు

నాలుగో సారి వాయిదా పడిన టెండర్..

నాలుగోసారి తలనీలాల సేకరణకు నిర్వహించిన టెండర్‌కు కాంట్రాక్టర్లు హాజరైన సరైన ధర రాకపోవడంతో అధికారులు వాయిదా వేశారు. తిరిగి ఐదో సారి ఏప్రిల్ 10వ తేదీన నిర్వహిస్తామని వెల్లడించారు.

మాట్లాడుతున్న ఎస్పీ మహేశ్ బీ గితె

కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలి : ఎస్పీ

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్2 (నమస్తే తెలంగాణ) : కేసుల దర్యాప్తులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని పోలీసు అధికారులకు ఎస్పీ మహేశ్ బీ గితె సూచించారు. నేరాల నియంత్రణకు పకడ్బందీగా వ్యవహరించాలన్నారు. జిల్లా పోలీసు కార్యాలయ మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో సిరిసిల్ల సబ్ డివిజన్ అధికారులతో బుధవారం నిర్వహించిన సమీక్షా సమావేశంలో దిశానిర్దేశం చేశారు. పోలీస్ స్టేషన్ల వారీగా నమోదైన కేసుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. గంజాయి, మహిళలపై నేరాలు, పోక్సో, మిస్సింగ్ కేసులు తీసుకుంటున్న చర్యలతో పాటు పెండింగ్ కేసులు త్వరగా పరిష్కరించాలని సూచించారు. 100 డయల్‌కు వచ్చే కాల్స్‌పై తక్షణమే స్పందించాలని, చట్టపరిధిలోని సమస్యలను వెంట వెంట పరిష్కరించాలని ఆదేశించారు. ప్రతి పోలీస్‌స్టేషన్ పరిధిలో గంజాయి, పేకాట, పీడీఎస్ రైస్, గుడుంబా ఇతర చట్ట వ్యతిరేకమైన నేరాలు, ఆసాంఘిక కార్యకలాపాలపై ప్రత్యేక నిఘా ఏర్పాటు చేసి కేసులు నమోదు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ చంద్రయ్య, డీఎస్పీ చంద్రశేఖర్‌రెడ్డి, సీఐలు కృష్ణ, మెగిలి, శ్రీనివాస్, సదన్‌కుమార్, మధుకర్, ఎస్ఐలు, సిబ్బంది పాల్గొన్నారు.

అనుమతులు లేని దవాఖానలను మూసివేయించాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 2 : జిల్లాలో సరైన అనుమతులు లేకుండా ప్రమాణాలు పాటించని, అనుమతులు లేని దవాఖానలను మూసివేయించాలని టీపీసీసీ లీగల్ డిపార్ట్‌మెంట్ కన్వీనర్ బుర్ర రవితేజ గౌడ్ బుధవారం కలెక్టర్ సందీప్ కుమార్ ఝాకు ఫిర్యాదు చేశాడు. అనంతరం రవితేజ మాట్లాడుతూ, సరైన అనుమతులు లేకుండా తగిన అర్హత లేని, అద్దె డాక్టర్లతో దవాఖానలు నిర్వహిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతున్న ప్రైవేట్ దవాఖానలపై చర్యలు తీసుకోవాలని కోరారు.

50 పడకల దవాఖాన నిర్మాణం చేయాలి

ఇల్లంతకుంట రూరల్, ఏప్రిల్ 2 : మండలకేంద్రంలో యాభై పడుకల దవాఖాన నిర్మాణం కోసం బీఆర్ఎస్ ప్రభుత్వ హయాంలోనే 17.60 కోట్ల నిధులు మంజూరు చేసి, అప్పటి వైద్య ఆరోగ్యశాఖ మంత్రి తన్నీరు హరీశ్‌రావు, మాజీ ఎమ్మెల్యే రసమయి బాలకిషన్ శంకుస్థాపన చేశారని, కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక యాభై పడకల దవాఖాన నిర్మాణం చేయడం లేదని బీఆర్ఎస్ ఇల్లంతకుంట పట్టణాధ్యక్షుడు కూనబోయిన రఘు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. స్థానిక ఎమ్మెల్యే కవ్వంపల్లి సత్యనారాయణ స్పందించి యాభై పడకల దవాఖాన నిర్మాణ పనులను ప్రారంభించేలా చర్యలు చేపట్టాలన్నారు.

బాధిత కుటుంబానికి బాసట

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 2: తంగళ్లపల్లి మండలంలోని మాజీ ప్రజా ప్రతినిధులు జౌదారాన్ని మరోసారి చాటుకున్నారు. తంగళ్లపల్లి మండలం, బస్వాపూర్‌లో ఇటీవల ప్రమాదవశాత్తు చెట్టుపై నుంచి పడి బంటు ఆనందం కూలి మృతి చెందాడు. విషయం తెలుసుకున్న బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ జడ్పీటీసీ కోడి అంతయ్య ఆనం దం బాధిత కుటుంబాన్ని పరామర్శించి, 50 కిలోల బియ్యం, అదే విధంగా బస్వాపూర్‌కు చెందిన బీఆర్ఎస్ సీనియర్ నేత, మాజీ ఎంపీటీసీ కనకలక్ష్మీలక్ష్మీరెడ్డి రూ. 2500, శ్రీనివాస్ రెడ్డి రూ. 2500 చొప్పున ఆర్థిక సాయం అందజేశారు.

మద్యం ఏరులై పారుతున్న కార్మిక వాడలు

కలెక్టరేట్, ఏప్రిల్ 2: జిల్లాలోని కార్మిక వాడల్లో మద్యం ఏరులై పారుతున్నా ఎక్సైజ్ శాఖ అదికారులు తమకేమీ పట్టనట్లు వ్యవహరిస్తున్నారని సీపీఎం జిల్లా కమిటీ సభ్యుడు ఎలిగేటి రాజశేఖర్ ఆరోపించారు. ఈ మేరకు సిరిసిల్లలోని పార్టీ కార్యాలయంలో విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి, మాట్లాడారు. సిరిసిల్ల పట్టణంలో ముఖ్యంగా కార్మిక వాడల్లో మద్యం ఏరులై పారుతూ యువతను మత్తుకు బానిస చేస్తుందని పట్టించుకోవాల్సిన ఎక్సైజ్ అధికారులు నిమ్మకు నీరు ఎత్తినట్టు వ్యవహరించడం చాలా సిగ్గు చేటన్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి మద్యం అమ్మకాలను అరికట్టాలని డిమాండ్ చేశారు.

జాబ్ మేళాను సద్వినియోగం చేసుకోవాలి

గంభీరావుపేట, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని కేజీ టు పీజీ విద్యా సముదాయం డిగ్రీ కళాశాలలో 4వ తేదీన నిర్వహించనున్న జాబ్ మేళాను అర్హులైన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ విజయలక్ష్మి బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మ్యూజిక్ బస్ వారి సహకారంతో నిర్వహించనున్న జాబ్ మేళాలలో ప్రముఖ కంపనీలు పాల్గొంటాయని, డిగ్రీ పూర్తయిన విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రిన్సిపాల్ పేర్కొన్నారు.

ఆర్మీ జవాన్‌కు అపూర్వ స్వాగతం

- ఉద్యోగ విరమణ అనంతరం స్వగ్రామం నారాయణపూర్‌కు రాక
- ప్రత్యేక వాహనంపై ఊరేగింపు
- పటాకులు పేలుస్తూ, పూలుచల్లుతూ సంబురం

ఆర్మీ రిటైర్డ్ జవాన్ రవి దంపతులను సన్మానిస్తున్న గ్రామస్తులు

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2: దేశ రక్షణలో ప్రాణాలను పణంగా పెట్టి 22 ఏళ్లు సేవలందించి విరమణ పొందని ఆర్మీ జవాన్ రవికి నారాయణపూర్‌వాసులు అపూర్వ స్వాగతం పలికారు. ఊరు ఊరంతా కలిసి ఎల్లారెడ్డిపేట నుంచి స్వగ్రామం వరకు గౌరవంగా తీసుకెళ్లారు. నారాయణపూర్‌కు చెందిన పంతంగి రవి 22 ఏండ్ల పాటు ఆర్మీ జవాన్‌గా పలు ప్రాంతాల్లో విధులు నిర్వర్తించి, గత నెల 31న ఉద్యోగ విరమణ పొందారు. బుధవారం స్వగ్రామానికి రావడంతో గ్రామస్తులంతా అపూర్వ సాగతం పలికారు. ఎల్లారెడ్డిపేట కొత్త బస్టాండ్ నుంచి రవి-కావ్యశ్రీ దంపతులను ప్రత్యేక వాహనంపై ఉంచి ఊరేగింపుగా తీసుకెళ్లారు. దారిపొడవునా పటాకులు పేలుస్తూ, పూలుచల్లుతూ యువకులు బైక్ ర్యాలీతో స్వగ్రామం వైపు కదిలారు. ఈ సందర్భంగా పలువురు నాయకులు, అధికారులు, యువకులు స్వచ్ఛందంగా దంపతులను కలిసి అభినందనలు తెలిపారు. నారాయణపూర్‌లో ఏర్పాటు చేసిన అభినందన సభలో రవి అందించిన సేవలను కొనియాడారు. విరమణ అనంతర జీవితాన్ని కుటుంబంతో సంతోషంగా గడుపుతూ సామాజిక సేవలో భాగస్వాములుగా ఉండాలని ఆకాంక్షించారు.

ఫాజుల్‌నగర్‌లో చిన్నారి మృతదేహానికి పోస్ట్‌మార్టం

పది రోజుల క్రితం మగ శిశువు మృతి

వేములవాడ రూరల్, ఏప్రిల్ 3 : మండలంలోని ఫాజుల్‌నగర్‌కు చెందిన గండి రాజశేఖర్-గీతాంజలి దంపతులకు మార్చి 18న కరీంనగర్‌లోని ఓ ప్రైవేట్ దవాఖానలో మగబిడ్డ జన్మించింది. అయితే పుట్టిన తర్వాత శిశువు ఆరోగ్యం నిలకడగా లేకపోవడంతో వెంటనే మరో దవాఖానకు తరలించారు. అయితే అక్కడ కూడా చిన్నారి పరిస్థితి విషమించడంతో హైదరాబాద్‌లోని నీలోఫర్ దవాఖానకు తరలించిన తర్వాత గంటల వ్యవధిలోని చిన్నారి మృతి చెందాడని దంపతులు ఆవేదన వ్యక్తం చేశారు. తమ చిన్నారి మృతికి కరీంనగర్‌లోని రెండు ప్రైవేట్ దవాఖానలే కారణమంటూ రెండో పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. అయితే బాధితుల ఫిర్యాదు మేరకు.. బుధవారం కరీంనగర్‌లోని రెండవ పట్టణ ఎస్ఐ చంద్రశేఖర్, దీపక్‌కుమార్ చిన్నారని పూడ్చిపెట్టిన ఫాజుల్‌నగర్‌కు చేరుకొని పంచనామ నిర్వహించారు. ఖననం చేసిన చిన్నారి మృతదేహాన్ని వేములవాడ రూరల్ మండల మేజిస్ట్రేట్ అబుబాకర్ సమక్షంలో బయటకు తీసి, చిన్నారి మృతదేహానికి ఏరియా దవాఖాన వైద్యులు ప్రణతిరెడ్డి పోస్టుమార్టం నిర్వహిం చారు. పోస్టుమార్టం నివేదిక వచ్చిన తర్వాత చర్యలు తీసుకుంటామని వారు తెలిపారు.

చిన్నారికి పోస్ట్‌మార్టం చేస్తున్న తహసీల్దార్, పోలీసులు

బోరు బావి పరిశీలన

ఎల్లారెడ్డిపేట, ఏప్రిల్ 2: కొంత కాలంగా పోచమ్మతండాలో తాగునీటి సమస్యపై ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో మిషన్ భగీరథ పైప్‌లైన్‌తో నీల్లందించే ప్రయత్నం చేస్తున్నప్పటికీ లీకేజీ ఇబ్బందులు ఎదురవుతున్నందున మంగళవారం కొత్తగా పల్లె ప్రకృతి వనం వద్ద బోరు వేయించారు. కాగా, బుధవారం అధికారులు తండాలో లీకేజీ ఏర్పడిన చోట్లను డీఈ ప్రేమ్ చందర్ పరిశీలించారు. ఏఈ సంతోష్, దేవరాజు ఉన్నారు.

మాదకద్రవ్యాల నియంత్రణపై పోస్టర్ ఆవిష్కరణ

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2: వేములవాడ మండలం అగ్రహారం డిగ్రీ కళాశాలో మాదకద్రవ్యాల నియంత్రణపై పోస్టర్‌ను ఆవిష్కరించినట్లు ప్రిన్సిపాల్ శంకర్ పేర్కొన్నారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ మాదకద్రవ్యాల వ్యతిరేకత అవగాహన కార్యక్రమం నిర్వహించామన్నారు. మాదకద్రవ్యాల వల్ల కలిగే నష్టాలపై విద్యార్థులకు అవగాహన కల్పించామన్నారు. ఈ కార్యక్రమంలో కళాశాల యాంటి డ్రగ్స్ కమిటీ కోఆర్డినేటర్ వై కరుణ, ప్రసాద్, శ్రీధర్, నర్సయ్య, తిరుపతి, మహేందర్, జయపాల్, శివాని, శాంతిరాజ్‌తో పాటు అధ్యాపక బృందం పాల్గొన్నారు.

దరఖాస్తుల ఆహ్వానం

కలెక్టరేట్, ఏప్రిల్ 2: రాష్ట్ర క్రీడా ప్రాధికార సంస్థ వారి ఆర్థిక సహాయంతో జిల్లా కలెక్టర్ సందీప్ కుమార్ ఝా అనుమతితో జిల్లా యువజన, క్రీడల శాఖ అధ్వర్యంలో ఉచిత వేసవి క్రీడా శిక్షణ శిబిరాల నిర్వహణకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు యువజన క్రీడల అధికారి అజ్మీర రాందాస్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. రాజన్నసిరిసిల్ల జిల్లాలోని గ్రామీణ ప్రాంతాల్లో పది శిక్షణ శిబిరాలు నిర్వహించడానికి మే 1 నుంచి 31 మే 2025 వరకు , 14 సంవత్సరాల లోపు వయసు కలిగిన బాల, బాలికలకు వివిధ క్రీడల్లో వేసవి క్రీడా శిక్షణ శిబిరాలు (నాన్ రెసిడెన్సియల్) నిర్వహించడానికి ఉత్సాహవంతులైన సీనియర్ క్రీడాకారులు, జాతీయ క్రీడాకారులు, వ్యాయామ ఉపాధ్యాయులు దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. ఈ నెల 11న జిల్లాలోని కలెక్టర్‌లోని జిల్లా యువజన క్రీడల శాఖ అధికారి కార్యాలయంలో దరఖాస్తులు చేసుకోవాలన్నారు. వివరాలకు ఫోన్ నంబర్ 9440239783,7569207411 ను సంప్రదించాలన్నారు.

ఘనంగా ప్రపంచ ఆటిజం దినోత్సవం

వేములవాడ రూరల్, ఏప్రిల్ 2: వేములవాడ మండల పరిషత్ కార్యాలయం ఆవరణలోని భవిత కేంద్రంలో ఘనంగా ప్రపంచ ఆటిజం దిన్సోవం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ఎంపీడీవో మల్హోత్రా, ఎంఈవో బన్నాజీలు ముఖ్య అతిథులుగా హాజరై, మాట్లాడారు. అనంతరం ఆలింకో ఆధ్వర్యంలో దివ్యాంగుల పిల్లలకు విల్‌చైర్లు, ట్రైసైకిళ్లతో పాటు పలు పరికరాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఐఈఆర్‌టీ కత్తి జయలక్ష్మి, ప్రధానోపాధ్యాయుడు భానుచందర్, రజని, ఫిజియోథెరపీ మయూరి, సీఆర్‌పీ శ్రీనివాస్, ధనుంజయ్, రాంప్రసాద్ తదితరులు ఉన్నారు.

కోర్టు, ఈఆర్‌సీ ఆదేశాల మేరకు బ్యాక్ బిల్లింగ్ వసూళ్లు

సెస్ చైర్మన్ చిక్కాల రామారావు

రాజన్న సిరిసిల్ల, ఏప్రిల్ 2 (నమస్తే తెలంగాణ): కోర్టు, ఈఆర్‌సీ ఆదేశాల మేరకే బ్యాక్ బిల్లింగ్ చార్జీలు వసూలు చేస్తున్నారని సెస్ చైర్మన్ చిక్కాల రామారావు తెలిపారు. ఇందులో పాలకవర్గానికి ఎలాంటి సంబంధం లేదని స్పష్టీకరించారు. మరమగ్గాలకు ఇస్తున్న సబ్సిడీ 10 నుంచి 25 హెచ్‌పీలకు పెంచాలని ఈఆర్‌సీ బహిరంగ విచారణలో చైర్మన్ దృష్టికి తీసుకెళ్లిన విషయాన్ని గుర్తు చేశారు. తన సూచన మేరకు సాంచాలకు 25హెచ్‌పీల వరకు ప్రభుత్వం సబ్సిడీ పొడిగించిందని చెప్పారు. సెస్ కార్యాలయంలోని ఆయన చాంబర్‌లో బుధవారం పాలకవర్గ సభ్యులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో వివరాలను వెల్లడించారు. సిరిసిల్ల పట్టణంలోని మరమగ్గాలకు 10హెచ్‌పీల వరకు సబ్సిడీ వర్తింస్తున్నందున అంతకన్న ఎక్కువ హెచ్‌పీలు వాడుతున్న వారిపై చర్యలు తీసుకోవాలని కొందరు కోర్టును ఆశ్రయించినట్లు తెలిపారు. కోర్టు, ఈఆర్‌సీ ఆదేశాలను పాటిస్తున్నామే తప్ప సహకార సంస్థ బైలాకు వ్యతిరేకంగా పనిచేసే నిర్ణయాలు తీసుకునే అధికారం పాలకవర్గానికి లేదన్నారు. 107 యూనిట్లకు సంబంధించి రూ. 32 కోట్లు బ్యాక్ బిల్లింగ్ బకాయిలు చెల్లించాలని సంస్థ నోటీసులు జారీ చేయగా, కొంత సమయం ఇస్తే చెల్లిస్తామంటూ స్వయాన ఆసాములు, యజమానులే లిఖిత పూర్వకంగా రాసి ఇచ్చారని చెప్పారు. వారి రాసిచ్చిన గడువు కూడా దాటిపోయిందని తెలిపారు. మరమగ్గాల యజమానులు, ఆసాములపై తమకు ఎలాంటి శతృత్వం లేదని, ఇప్పటి వరకు బిల్లింగ్‌లో నయాపైసా మాఫీ చేసిన దాఖలాలు లేవన్నారు. 26 నెలలుగా పాలకవర్గం చిత్తశుద్ధితో వినియోగదారులకు మెరుగైన సేవలందిస్తుందన్నారు. వినియోగదారులు ఎన్నుకున్న పాలకవర్గంపై అబాండాలు వేస్తూ, అపవాదును అంటగట్టాలను కోవడం సరైంది కాదన్నారు. 50 ఏండ్లుగా మెరుగైన సేవలందిస్తున్న సహకార విద్యుత్ సంస్థను బోర్టులో కలిపేలా చేస్తామంటూ కొందరు తమను ఫోన్ చేసి బెదిరింపులకు, బ్లాక్ మెయిలింగ్‌లకు పాల్పడుతున్నారని ఆరోపించారు. పాలకవర్గం ఎలాంటి తప్పు చేసినా ఎలాంటి విచారణకైనా సిద్ధంగా ఉన్నామని స్పష్టం చేశారు. యజమానులు, ఆసాములపై కక్షపూరితంగా వ్యవహరిస్తున్నామంటూ చేస్తున్న ఆరోపణల్లో ఎలాంటి వాస్తవం లేదని ఖండించారు. సెస్ పరిధిలో రూ. 162 కోట్ల బకాయిలు వసూలు చేస్తేనే ఎన్‌పీడీసీఎల్‌కు నెలనెల కట్టడం జరుగుతుందన్నారు. పాలకవర్గం చట్ట ప్రకారం ముందుకు పోతుందన్నారు. కలిసి మెలిసి ఉండి సంస్థను కాపాడుకుందామని విజ్ఞప్తి చేశారు.

మాట్లాడుతున్న సెస్‌చైర్మన్ చిక్కాల రామారావు

సెస్ ముందు ఆసాములు, యజమానుల ఆందోళన ..

బ్యాక్ బిల్లులు మాఫీ చేయాలంటూ మరమగ్గాల ఆసాములు, యజమానులు ఆందోళనకు దిగారు. అఖిల భారత పద్మశాలీ సంఘం నేతలు గడ్డం జగన్నాథం ఆధ్వర్యంలో యజమానులు కల్యాడపు సుభాష్, దూడం శంకర్, బొడ్డుల సుదర్శన్ సెస్‌ఎండీని కలిసి చర్చలు జరిపారు. నేతన్నలకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో ప్రభుత్వం చీరెల ఆర్డర్లు ఇచ్చిందని, బ్యాక్ బిల్లింగ్ పేరుతో 107 యూనిట్లకు కరెంట్ సరఫరా నిలిపి వేయడం ఏమిటని నిలదీశారు. కరెంటు సరఫరా నిలిపి వేయడంతో చీరెల తయారీ ఆగిపోతుందని, దీంతో ప్రభుత్వానికి చెడ్డపేరు తెచ్చేందుకు కుట్రలు పన్నుతున్నారంటూ మండిపడ్డారు. ప్రభుత్వం నుంచి రావాల్సిన సబ్సిడీలు, బ్యాక్ బిల్లింగ్‌ల వివరాలు అడిగి తెలుసుకున్నారు. వెంటనే కరెంటు సరఫరా పునరుద్దరించాలని వారు డిమాండ్ చేశారు. పద్మశాలీ సమాజిక వర్గంపై కావాలని కక్షపూరితంగా సెస్ అధికారులు వ్యవరించడం సరైంది కాదన్నారు. సిరిసిల్ల సమస్యలపై ప్రభుత్వ దృష్టికి తీసుకెళ్తామని పద్మశాలీ సంఘం నేతలు తెలిపారు.

ప్రణాళికా బద్ధంగా ముందుకు సాగాలి

సిరిసిల్ల రూరల్, ఏప్రిల్ 2 : విద్యార్థులు ప్రణాళికా బద్ధంగా చదువుతూ ముందుకు సాగాలని జిల్లా విద్యాధికారి జనార్దన్‌రావు సూచించారు. ఈ మేరకు బుధవారం తంగళ్లపల్లి మండలంలోని జిల్లెల్ల జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా పాఠశాలలో మధ్యాహ్న భో జనాన్ని పరిశీలించారు. ఉపాధ్యాయులకు సూచనలు అందించారు.

పేదల సంక్షేమమే ధ్యేయం

రుద్రంగి, ఏప్రిల్ 2: పేదల సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయమని ఏఎంసీ చెర్మన్ చెలుకల తిరుపతి అన్నారు. బుధవారం మండలంలోని దేగావత్‌తండా, బడితండా గ్రామాల్లో రేషన్ దుకాణాల్లో సన్న బియ్యాన్ని నాయకులతో కలిసి లబ్ధిదారులకు పంపిణీ చేశారు. ప్రతి ఒక్కరూ సన్నబియ్యా న్ని వినియోగించుకోవాలన్నారు.

ముగిసిన 'పబి' పరీక్షలు

ముస్తాబాద్, ఏప్రిల్ 2: మండల కేంద్రంలోని రెండు పరీక్షాకేంద్రాల్లో పదోతరగతి వార్షిక పరీక్షలు ప్రశాంతంగా ముగిశాయి. కేంద్రాల్లో నిర్వాహకులు, పోలీసు ప్రహరా మధ్య ప్రశాంతంగా జరిగాయి.

ఎరుకల ప్రజా సంఘం కార్యవర్గం

వేములవాడ, ఏప్రిల్ 2 : వేములవాడ తెలంగాణ ఎరుకల ప్రజా సంఘం కార్యవర్గం ఎన్నిక బుధవారం నిర్వహించారు. ఇందులో అధ్యక్షులుగా కుతాడి రాజేశం, ఉపాధ్యక్షులుగా మానుపాటి తిరుపతి, రవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీరాముల నవీన్, కార్యదర్శిగా రాజు, సలహాదారుడుగా కుతాడి గంగయ్య, కార్యవర్గ సభ్యులుగా కుతాడి మల్లేశం, సార్ల గంగరాజు, మొగిలి సంతోష్, కోనేరు రాజేశం, మొగిలి దినేశ్, రాశేశంలను ఎకగ్రీవంగా ఎన్నుకున్నట్లు వారు తెలిపారు.

హమాలీ కూలీ రేట్లు పెంచాలి

కలెక్టరేట్, ఏప్రిల్ 2: హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని ఆల్ మండల హమాలీ వర్కర్స్ యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి ఎగమంటి ఎల్లారెడ్డి డిమాండ్ చేశారు. ఈ మేరకు బుధవారం హమాలీ కార్మికుల కూలీ రేట్లు పెంచాలని కలెక్టరేట్ కార్యాలయంలో ఏవో రాంరెడ్డికి వినతిపత్రం అందజేశారు. లేకుంటే పెద్ద ఎత్తున కలెక్టర్ ఎందుట ధర్నా చేస్తామన్నారు. హమాలీ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షులు సావనపల్లి రాములు, జిల్లా ఉపాధ్యక్షులు ఎలిగేటి రాజశేఖర్, జిల్లా నాయకులు నర్సయ్య, కనకయ్య పాల్గొన్నారు.

పాఠశాల యాజమాన్యంపై కేసు

ముస్తాబాద్, ఏప్రిల్ 2 : మండల కేంద్రంలోని ఓ ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం అనుమతులు లేకుండా ప్రధాన రహదారిని దిగ్బందం చేసి, వేడుకలు నిర్వహించగా, స్థానికులు వాహనదారులకు ఇబ్బందులు ఏర్పడడంతో పాఠశాల యాజమాన్యంపై కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ గణేశ్ తెలిపారు. ముస్తాబాద్‌లోని శ్రీవాణి ప్రైవేట్ పాఠశాల యాజమాన్యం మంగళవారం పట్టణంలోని ప్రధాన రహదారికి రెండు వైపులా అడ్డు కట్టలు కట్టి పాఠశాల వార్షికోత్సవం నిర్వహించారు. కాగా, కేసు నమోదు చేసినట్లు తెలిపారు.

సర్దార్ స